పోరాటంతో రోడ్లకు నిధులు మంజూరు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని మారుమూల జర్రాకొండ పంచాయతీ ప్రజల పోరాటం తోనే తారు రోడ్డు మంజూరు అయ్యిందని హుకుంపేట మండల వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ, రోడ్డు లేక సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్ల లేక పోవడంతో మహిళలు, చిన్నారులు మృతి చెందారన్నారు. గిరిజన సంఘం, సీపీఎం ఆధ్వర్యాన గిరిజనులు జిల్లా కలెక్టర్‌కు అనేక దరఖాస్తు ఇచ్చారు. 20 సంవత్సరాల గ్రామ ప్రజల పోరాటం తర్వాత ఎట్టకేలకు గన్నేరు పుట్టు జంక్షన్ నుండి గవ్వల మామిడి మీదుగా గేదెల పాడుకు రూ.2 కోట్లతోనూ, గేదెల పాడు నుండి సీసాయి పనుకు మీదుగా జర్రాకొండ వరకు రూ 3 కోట్లు మొత్తంగా 5 కోట్ల వ్యయంతో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా తారురోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయన్నారు. సమావేశంలో జర్రాకొండ సర్పంచ్ కొర్ర చిట్టిబాబు, మాజీ సర్పంచ్ శోభ ఎర్రం నాయుడు, వైస్ సర్పంచ్ సీదరి లక్ష్మణ్ రావు, సిపిఎం మండల కార్యదర్శి వి.లక్ష్మణ్‌రావు, గిరిజన సంఘం కార్యదర్శి కృష్ణా రావు, వార్డ్ మెంబర్‌లు మర్రి శైలజ, మర్రి కేశవరావు, సీదరి కొండలరావు పాల్గొన్నారు.

సమస్యలతో అంగన్వాడీలు సతమతం

సర్కారుపై సమరానికి సమాయత్తం ▸▸ 6న పెద్ద ఎత్తున ధర్నాకు పిలుపు

ప్రజాశక్తి-పాడేరు: అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు తమ డిమాండ్ల పరిష్కారం కోసం సర్కారుపై సమరానికి సమాయత్తమవుతున్నారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పిలుపు మేరకు జనవరి 24, 25 తేదీల్లో ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలను నిర్వహించిన సంగతి విధితమే. తమ ఈ ఆందోళనలో భాగంగా ఫిబ్రవరి 6న జిల్లా స్థాయిలో అంగన్వాడీ వర్కర్లు అల్లూరి జిల్లా కలెక్టరేట్, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. పేద గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు నిత్యం నిరంతరం అనేక సేవలు అందిస్తున్న అంగన్వాడీ వర్కర్లు తమకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి ఇవ్వాలని గత కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తూ అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ప్రభుత్వ నుంచి స్పందన కరువైంది. అంగన్వాడీ సెంటర్లలో మౌలిక వసతులు కల్పించాలని, గత 8 ఏళ్లుగా ప్రభుత్వం చెల్లించని టిఏ లను మంజూరుకు, ఆరు నెలల కాస్మొటిక్స్ బకాయిలను చెల్లించాలని అంగన్వా డీలు దపదపాలుగా ఆందోళనలు కొనసాగిస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది. తమ సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అంగన్వాడి వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైయస్సార్ సంపూర్ణ పోషణ పథకం అమలు చేస్తున్న మెనూకు తగిన విధంగా మెస్ ఛార్జీలు, సరుకుల క్వాంటిటీ పెంచలేదని అంగన్వాడీ వర్కర్లు చెప్తున్నారు. అంగన్వాడి సెంటర్ల నిర్వహణకు తాము పెట్టుబడులు పెట్టి లబ్ధిదారులకు పోషకాహారం పంపిణీ నిర్వహించవలసి వస్తోందని, చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించకుండా అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయడానికి నిధులు పెంచకుండా.. తమపై పని భారం పెంచి అధికారుల వేధింపులు తీవ్రతరం చేసిందని వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తమకు ఉద్యోగ భద్రత కరువైందని అంగన్వాడి వర్కర్లు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం తెచ్చిన రకరకాల యాప్‌లతో తమపై అధికారులు తీవ్ర ఒత్తిడి చేస్తున్నారని, పని భారం పెంచారని, పలు వేధింపులు అనేక ఒడిదుడుకులు మధ్య తాము విధులు నిర్వర్తిస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యంగా ఫేస్ యాప్ విధానంను రద్దు చేయాలని అంగన్వాడీ వర్కర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నెట్ సౌకర్యం సంపూర్ణంగా లేదని, దీంతో అనేక ఇబ్బందులు ఎదురవుతాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేసి, 2017 నుండి పెండింగ్లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలని తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్ 5 లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్, సీనియారిటీ ప్రకారం వేతనాలు, సూపర్ వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలని, 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, మినీ సెంటర్లోని వర్కర్లను మెయిన్ వర్కర్లుగా తీసుకోవాలని. అదనంగా హెల్పర్ నియామకం, లబ్ధిదారులకు నాణ్యమైన ఆహార సరఫరా నిమిత్తం ఆయిల్, కందిపప్పు క్వాంటిటీ పెంచాలని, అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు, అంగన్వాడీలకు మెడికల్ లీవ్ సౌకర్యం, సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, భీమా అమలు తదితర సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 1ని రద్దు చేయాలని అంగన్వాడీ వర్కర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఆందోళన చేపడుతున్న అంగన్‌వాడీలు (ఫైల్ పాటో)

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న చిన్నయ్యపడాల్, నాయకులు

హైడ్రో పవర్ ప్రాజెక్టు

ప్రతిపాదనను విరమించుకోవాలి

- గిరిజన సంఘం నేత చిన్నయ్యపడాల్

- 3న మాజీ ఎంపీ మధుతో ముఖాముఖి, సభ

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా చింతపల్లి మండలం ఎర్రవరంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ప్రతిపాదనను ప్రభుత్వం విరమించాలని ఎర్రవరం హైడ్రో ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్, గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. హైడ్రో ప్రాజెక్టు బాధిత గ్రామాల గిరిజనులతో ఎర్రవరంలో ఫిబ్రవరి 3న మాజీ ఎంపీ మధుతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఎర్రబొమ్మల పంచాయతీ ఎర్రబంద గ్రామంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ బాధిత గ్రామాల గిరిజనులతో కలిసి 3వ తేదీన ఎర్రవరంలో జరగనున్న సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, చింతపల్లి మండలం ఎర్రవరం, అనంతగిరి మండలం పెదకోట చిట్టంపాడు కుజ్జలి ప్రాంతాల్లో సుమారు 5500 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి కోసం హైడ్రో పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర క్యాబినెట్‌లో 2022 డిసెంబర్ 13న నిర్ణయించిందన్నారు. నాలుగు ప్రాజెక్టుల్లో 8 డ్యాముల ఏర్పాటుతో సుమారు 94 గ్రామాల్లో 15 వేల మంది గిరిజన ప్రజల గృహాలు, సాగు అటవీ భూమి సుమారు 20వేల ఎకరాలు మునిగి పోతుందని తెలిపారు. గిరిజనుల జీవనాధారం సర్వనాశనం అవుతుందని, సీలేరు విద్యుత్ పవర్ ప్రాజెక్టుతో సుమారు 25 వేల కుటుంబాలు తమ సొంత గ్రామాలను వదిలి మైదాన ప్రాంతాలైన చిడి కాడ, దేవరాపల్లి, రావికమతం తదితర ప్రాంతాలకు వలస వెళ్లి కౌలు రైతులుగా, బానిసలుగా మారి పోయారన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మిస్తే గిరిజనుల నిరాశ్రయాసులై వలస పోవలసిన పరిస్థితి దాపురిస్తుందని, బాక్సైట్ తరహాలోనే హైడ్రో పవర్ ప్రాజెక్టులో గిరిజన హక్కులు ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. గిరిజన సలహా మండలి తీర్మానం లేకుండా గిరిజన ప్రాంతంలో ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలకు భూమి కేటాయించరాదని, సుప్రీంకోర్టు తీర్పును ధిక్కరించడం ప్రభుత్వానికి తగదన్నారు. స్థానిక గిరిజనుల ఆమోదం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం హైడ్రోపవర్ ప్రాజెక్టు ప్రకటించడంతో గిరిజనులు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారని, గిరిజన హక్కులు, చట్టలు ఉల్లంఘించి హైడ్రో పవర్ ప్రాజెక్టులను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం దారుణమన్నారు.

ఫిబ్రవరి 3న గొందిపాకల పంచాయతీ ఎర్రవరం గ్రామంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు బాధిత గ్రామాల గిరిజనులతో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ రాజ్యసభ సభ్యులు పెనుమల్లి మధు ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని, అనంతరం సభ నిర్వహిస్తామన్నారు. ఈ సభకు చింతపల్లి మండలం ఎర్ర బొమ్మలు, గొందిపాకలు, కొయ్యూరు మండలం వెలగల పాలెం, పి మాకవరం సర్పంచులు, ఎంపిటీసీలు, బాధిత గ్రామాల గిరిజనులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయ్, జిల్లా నాయకులు గడతూరి సత్యనారాయణ, బాధిత గ్రామాల గిరిజనులు ఉన్నారు.

వైభవంగా మోదకొండమ్మ తీర్థం

- అలరించిన ముగ్గుల పోటీలు - ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు మోదకొండమ్మ అమ్మవారి సంక్రాంతి తీర్థ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాల తోను, అమ్మవారి విగ్రహానికి నిలువెత్తు గజమాలతో అలంకరించారు. ఆలయంలో పూల అలంకరణతోను తీర్చిదిద్దారు. ఉదయం నుంచి ఆలయం వద్ద భక్తులు బారులు తీరి అమ్మవారిని పూజలు చేసి దర్శించుకున్నారు. తీర్థాన్ని పురస్కరించుకొని అమ్మవారికి భక్తులు సమర్పించిన పట్టుచీరలను ఆలయ కమిటీ వేలం నిర్వహించారు. మహిళలు వాటిని పాడుకొని సొంతం చేసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ముగ్గుల పోటీకి మహిళల నుంచి మంచి స్పందన లభించింది. ఆలయం వద్ద మధ్యాహ్నం జరిగిన అన్న సమారాధన కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం కాపునాడు ఆధ్వర్యంలో మహిళలు సారె ఊరేగింపు గా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. పట్టణంలోని మహిళలు అనేక రకాల స్వీట్స్ ను అమ్మవారికి తీసుకువచ్చి కానుకగా ఇచ్చారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ,పాదాలను పల్లకిలో ఉంచి పురవీధులలో ఊరేగించారు. మోదకొండమ్మ అమ్మవారి ఊరేగింపు లో భాగంగా తీర్థంలో నిర్వహించిన నత్య ప్రదర్శనలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. అమ్మవార్ల వేషాలు, దేవతామూర్తుల వేషాలు కోలాటం వీక్షకులను అలరించాయి. మోదకొండమ్మ అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ పాడేరు శాసన సభ్యురాలు కొట్ట గుల్లి భాగ్యలక్ష్మి, అరకు శాసనసభ్యులు శెట్టి ఫాల్గుణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ తమర్భ నర్సింగ్ రావు, పాడేరు మేజర్ పంచాయతీ సర్పంచ్ కె ఉషారాణి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కే సింహాచలం నాయుడు, తెలుగుదేశం పార్టీ నాయకుడు కొత్త గుల్లి సుబ్బారావు ఉప సర్పంచ్ బురెడ్డి రాము మాజీ సర్పంచ్ వర్తన పిన్నయ్య అన్నప్రసాద కమిటీ శివరాత్రి శ్రీను ముకుందరావు కొండలరావు ఆలయ కమిటీ ఆధ్యాత్మిక బందం కె. రామారావు ఉప్పల వెంకటరత్నం బలరాం మజ్జి శోభ అప్పన్న దొర బాలన్న, బాబురావు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తీర్థంలో పాల్గొన్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, నాయకులు

విచిత్ర వేషాల్లో కళాకారులు

సీలేరు వారపుసంతలో పోలీసుల విస్తృత తనిఖీలు

వాహన పత్రాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ రామకృష్ణ, ఇతర పోలీసులు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు వారపుసంతలో సిఆర్‌పిఎఫ్ 42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, స్థాని ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రధానమార్గంతోపాటు సంతకు వచ్చే దారిలో ఆటోలు, కార్లు, ఇతర వాహనాలను అపి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి రికార్డులు తనిఖీ చేసి అన్నీ సక్రమంగా ఉన్నాయని నిర్ధారించుకున్నాకే విడిచిపెట్టారు. స్థానిక ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో అపరిచిత, అనుమానిత వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టి, వారి ఆధార్, ఇతర గుర్తింపు కార్డులను అడిగి, వాటి ఆధారంగా సరిపోల్చిన తర్వాతే రామాలయం సెంటర్, ఐటిఐ జంక్షన్ వద్ద పోలీసులు గస్తీ నిర్వహించారు. సీలేరు ప్రధాన కూడళ్ల వద్ద సిఆర్‌పిఎఫ్ బలగాలు మోహరించి తనిఖీలు చేపట్టారు. ఎపి జెన్‌కో కార్యాలయాలు, స్థానిక జల విద్యుత్ కేంద్రం, రిజర్వాయర్లపై స్థానిక ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నిఘాతో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఇదే సమయంలో వారపుసంతలోని దుకాణాల్లో నకిలీ, నాసిరకపు వస్తువుల విక్రయాలపై వ్యాపారులను హెచ్చరించడంతోపాటుగిరిజనులకు వాటిని అవగాహన కల్పించే చర్యలు చేపట్టారు. తనిఖీల్లో సిఆర్‌పిఎఫ్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

జియో పనులతో రోడ్లు ఛిద్రం

ప్రజాశక్తి-జిమాడుగుల: మండలంలో మూల గ్రామాల్లో జియో టవర్ల నిర్మాణ పనుల కారణంగా రహదారులు ఛిద్రం అవుతున్నాయి. మండలంలోని సోలభం పంచాయతీ వట్టివేశ గ్రామానికి జియో సెల్‌టవర్ కోసం, మండలం కేంద్రం నుండి వట్టివేశ గ్రామానికి భూమి లోపల నుండి జియో కేబుల్, వైర్ల ఏర్పాటుకు రోడ్లు తవ్వేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఆర్‌అండ్‌బి రహదారికి రెండు మీటర్ల దూరంలో వీటి ఏర్పాటు చేయాలి, కానీ తారురోడ్డుకు ఆనుకొని అడుగు దూరంలో జెసిబితో గోతులు తవ్వి వాటిలో అమర్చుతున్నారు. ఇలా రోడ్డు పక్కన గోతులు తీయడంతో తారురోడ్డు పూర్తిగా బీటలువారి పాడౌతోంది. బూసుపల్లి గ్రామం నుండి వట్టివేశు గ్రామం వరకు రెండు కిలోమీటర్లు ఇలా చేయడంతో రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. కొన్ని నెలలు క్రితం బొయితిలి పంచాయతీ ఎగురాపల్లి గ్రామంలో జియో కాంట్రాక్టర్ ఇలానే చేయడంతో ఎగురాపల్లి గ్రామ సమీపంలో కల్వర్టు కూలి పోయి లారీ బోల్తా పడింది. ఇష్టానుసారంగా రహదారులను ధ్వంసం చేస్తూ పనులను నిర్వహించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు పక్కనే వేస్తున్న జియో కేబుల్

దిగుబడులపై కొండంత ఆశ

▸▸ విరగబూసిన జీడి, మామిడి

▸▸ వాతావరణం అనుకూలిస్తే లాభాల సిరులు

▸▸ ఆశాభావంతో మన్య ప్రాంత రైతులు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు, దారకొండ, దుప్పిలివాడ పరిసర ప్రాంతాల్లో జీడి, మామిడి పూత ఆశాజనకంగా ఉండడంతో గిరిరైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు అనుకూలించిన వాతావరణ పరిస్థితులు మున్ముందు సహకరించే ఈ ఏడాది మామిడి, జీడి పంటల్లో మంచి దిగుబడులు సాధించి, లాభాల సిరులు పండుతాయని గిరి రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే గతేడాది, అంతకుముందు పరిస్థితులే రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. గతంలోనూ ఆదిలో పూత, పిందె, కాయ దశ వరకు జీడి.మామిడి పంటలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, తర్వాత పొగమంచు, సుడిదోమ తదితర తెగుళ్ల, చీడపీడలతో పంట దిగుబడులపై గణనీయమైన ప్రభావం కనిపించి, కనీసస్థాయిలోనే దిగుబడులు వచ్చాయి. అయితే ఈఏడాది ఆ పరిస్థితి తలెత్తకుండా చివర వరకు పరిస్థితులన్నీ అనుకూలించి, సిరులు కురిపిస్తాయని గిరిజన రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.
కాగా సీలేరు అటవీశాఖ ఆధ్వర్యంలో గిరిజన రైతులకు ఉచితంగా అందజేసిన జీడి,మామిడి మొక్కలు ఇపుడు తోటలుగా వృద్ధి చెంది, రెండుమూడేళ్లుగా ఫలసాయాన్ని అందిస్తున్నాయని గిరిజన రైతులు అంటున్నారు. ప్రస్తుతం ఆ మొక్కతోటలతోపాటు ఏళ్ల వయస్సున్న చెట్లు సైతం విరగ పూయడమే గిరిజన రైతుల్లో అధిక దిగుబడులపై ఆశలు పెంచుతున్నాయి. ఇప్పటివరకు అనుకూలంగా ఉన్న వాతావరణం మున్ముందు సహకరిస్తే, గిరిజన రైతులకు లాభాలతోపాటు, ప్రజలకు తక్కువ ధరకు మామిడిపళ్లు లభిస్తాయని అంటున్నారు. ఇదే సమయంలో తమ తోటల్లోని పంట రక్షణకు ఉద్యానవన శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తగు సూచనలు అందించి, నాణ్యమైన అధిక దిగుబడులు సాధించేందుకు సహకరించాలని గిరి రైతులు కోరుతున్నారు.

నిండా పూతతో కళకళలాడుతున్న మామిడిచెట్టు

వెలవెలబోయిన వారపుసంత

కనీస స్థాయిలో రాని కొనుగోలుదారులు

అమ్ముడుపోని కూరగాయలు, ఇతర వస్తువులు

నష్టపోయామని లబోదిబోమంటున్న రైతులు, వ్యాపారులు

కొనుగోలుదారులు లేక బోసిపోయిన సీలేరు వారపుసంత

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలంలోని సీలేరు వారపుసంత వెలవెలబోయింది. ప్రతి ఆదివారం నిర్వహించే ఈ వారపుసంతకు ఆంధ్రా ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి భారీగా గిరిజనులు వచ్చి వారానికి సరిపడా కూరగాయాలు, ఇతర నిత్యావసరాలను కొనుగోలు చేసి తీసుకెళ్లడం ఆనవాయితీగా జరుగుతోంది. అయితే ఇటీవల క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి ఇలా పండుగలన్నీ వెళ్లిపోవడం, గిరిజనం తమకు అవసరమైన ఉస్తులు, ఇతరత్రా వస్తువులను అప్పట్లోనే కొనుగోలు చేసేయడంతో ఈ వారం సంతకు వచ్చేందుకు వారంతా అంతగా ఆసక్తి చూపలేదు. ఫలితంగా స్థాయిలో జరగపోవడంతో వ్యాపారులు వెలవెల పోయారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల నుంచి వలసగెడ్డ, కాట్రగెడ్డ, దుప్పిలివాడ తదితర గ్రామాల గిరిజన రైతులు తాము పండించిన వివిధ రకాల కూరగాయలు సీలేరు వారపుసంతకు విక్రయించేందుకు తీసుకొచ్చినా కొనేవాళ్లు రాకపోవడంతో సాయంత్రం వరకు వేచిచూసి నిరాశగా వెనుదిరిగారు. వేలల్లో పెట్టుబడులు పెట్టి పండించిన కూరగాయాలు అమ్ముడుకాకపోతే తాము నష్టాలు పాలుకావాల్సిందేనని గిరిజన రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం తాము పండించిన కూరగాయాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని వారంతా అంటున్నారు. అంతేకాక సీజన్‌లో తాముపండించే ఉత్పత్తులను నిల్వ ఉంచుకుని, తర్వాత మంచిధర వచ్చినపుడు అమ్ముకునేందుకు వీలుగా కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటు చేయలని కోరుతున్నారు.
సీలేరు వారపుసంతకు గిరిజనులు రాక బోసిపోయినప్పటికీ మరోవైపు సరిహద్దు ఆవల ఒడిశా చిత్రకొండలో నిర్వహించే వారపుసంత మాత్రం కళకళలాడిందని అంటున్నారు. చిత్రకొండ వారపుసంతకు భారీగా గిరిజనులు తరలివెళ్లగా, సీలేరు వారపుసంతకు మాత్రం కనీసస్థాయిలోనైనా కొనుగోలుదారులు రాలేదని గిరిజన రైతులు, సంత వ్యాపారులు తలలు పట్టుకున్నారు. ప్రభుత్వం గిరిజన ఉత్తత్తులకు గిట్టుబాటు ధరతోపాటు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని వేడుకుంటున్నారు.

ప్రభుత్వం దిగొచ్చే వరకూ పోరాటం

42వ రోజు కొనసాగిన రిలే నిరాహార దీక్ష

రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న ప్రజా ఐక్యవేదిక ప్రతినిధులు

ప్రజాశక్తి-పాడేరు: ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఐటీడీఏ ముందు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం 42వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రజా ఐక్యవేదిక కన్వీనర్ కూడ రాధాకృష్ణ, కోకన్వీనర్ ప్రభుదాస్ మాట్లాడుతూ, అధికారులు, ప్రభుత్వం దిగి వచ్చే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని, ఆపే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థు మరణాలపై సమగ్ర విచారణ జరిపించి, ఆశ్రమ హాస్టల్స్‌లో హెల్త్ అసిస్టెంట్లు నియమిం చాలన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థుల మరణాలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షలు విరమించాలని ఇచ్చిన నోటీసులను ఉపసంహరించాలన్నారు.

గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుండా తమ దీక్షలు విరమింప చేయడం కోసం దొడ్డి దారిన ఇలాంటి కుటిల ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. గిరిజన విద్యార్థుల మరణాలు అరికట్టేందుకు, అధికారులు ప్రజాసంఘాలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయడంలో ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. గిరిజన విద్యార్థుల మరణాలు అరికట్టేందుకు 260 మంది హెల్త్ అసిస్టెంట్లను తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. గిరిజన విద్యార్థుల వరస మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, గిరిజన ఆశ్రమ విద్యార్థులు మరణాలు అరికట్టేందుకు శాశ్వత పరిష్కార మార్గం చూపాలని తెలిపారు. ప్రజా సంఘాలతో సమావేశం తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు చిన్నారావు, బత్తిరి నరేష్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

సినీ దర్శకుడు త్రినాథ్‌కు సత్కారం

ప్రజాశక్తి -అనకాపల్లి : గవరపాలెం గౌరీ పరమేశ్వరుల మహోత్సవం సందర్భంగా సినీ దర్శకుడు నక్కిన త్రినాథ్, బుల్లితెర హాస్యనటుడు, జబర్దస్త్ సత్తిపండులను ఘనంగా సత్కరించారు. ఉత్సవాల సందర్భంగా టిడిపి బిసి సాధికారత సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర ఇంటి సమీపంలో హనుమాన్ యూత్, గంగ పరదేశమ్మ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టేజి ప్రోగ్రామును సురేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్కార గ్రహీతలు నక్కిన త్రినాథ్, జబర్ధస్త్ సత్తిపండు మాట్లాడుతూ ఏటా జరిగే గవరపాలెం గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలకు తమను ఆహ్వానించడం గర్వంగా ఉందన్నారు. గతంలో ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన లక్షలాదిమందిలో తాము ఒకరిగా ఉండేవారమని, కానీ ఇపుడు తమను ప్రత్యేక వ్యక్తులుగా గౌరవించడం, సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎల్లపు దివాకర్, మారిశెట్టి బాల, మల్ల జగప్పారావు, ఎల్లపు నూకరాజు పాల్గొన్నారు

నేడు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పర్యటన

ప్రజాశక్తి-జి.మాడుగుల:మండలంలో పలు గ్రామాలను ఈనెల 30న శాసన సభ్యురాలు కోటగుల్లి భాగ్యలక్ష్మి పర్యటించనున్నారు. గడప గడపకు కార్యక్రమంలో భాగంగా భీరం గ్రామ సచివాలయం పరిధిలోని అగంపాడు, వనెల్బ, బొడ్డపుట్టు, తుమ్మిదేల నేరోడి, వి.కోడాపల్లి, వెంకన్నపాలెం గ్రామాలలో పర్యటిస్తారు.

సమావేశంలో మాట్లాడుతున్న మసేను

పోర్టుల ప్రయివేటీకరణను అడ్డుకోవాలి

ప్రజాశక్తి- మాధవధార : పోర్టుల ప్రయివేటీకరణను అడ్డుకోవాలని విశాఖపట్నం పోర్టు ట్రస్టు మాజీ సభ్యులు బిసిహెచ్ మసేను కోరారు. హార్బర్ అండ్ పోర్టు పెన్షనర్స్, వెల్ఫేర్ అసోసియేషన్ వనభోజన కార్యక్రమం మాధవధార తోటలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిసిహెచ్.మసేను ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల సొమ్ముతో ఏర్పాటైన ప్రభుత్వ పరిశ్రమలను గుజరాత్ కార్పొరేట్ సంస్థలకు మోడీ తెగ నమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పింఛన్‌దారులకు ఆసుపత్రి సౌకర్యాలను ప్రయివేటుపరం చేస్తున్నారని తెలిపారు. మోడీ పాలనతో నిరుద్యోగం పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల రానున్న రోజుల్లో పింఛను వచ్చే అవకాశం తగ్గుతుందని తెలిపారు. పింఛన్‌దారులంతా ఒకే తాటిపై ఉండి పోరాటాలకు సిద్ధపడాలని కోరారు. అనంతరం అసోసియేషన్ చైర్మన్ సనపల బంగారు రాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి అప్పారావు, ప్రధాన కార్యదర్శి శివప్రకాష్‌రావు, అడ్వయిజర్ అన్నెపు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రయివేటీకరణపై కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ఆదివారం నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గాజువాక సమన్వయ కర్త జెర్రిపోతుల ముత్యాలు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో విశాఖనగర అధ్యక్షులు గొంపా గోవింద్ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన ప్రజా సంపద విశాఖ ఉక్కు కర్మాగారమన్నారు. దీన్ని కాపాడటానికి కాంగ్రెస్ పార్టీ రాజీలేని పోరాటం చేస్తుందని తెలిపారు. ఉక్కు ప్రజాగర్జనకు కాంగ్రెస్ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ కన్వీనర్ కెఎస్ఎన్.రావు, కాంగ్రెస్ నాయకులు కొవిరి కోదండరావు, యరబాల భూలోక, కట్టా అప్పారావు, ఎమ్.వర్మ, రామారావు, కొవిరి దేముడు, బసా రెడ్డి, ఆనంద్, రాజు, నాయుడు, సరీఫ్, ప్రసాద్, అప్పారావు అప్పలరాజు పాల్గొన్నారు.

కళింగ కుటుంబాల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి -మాధవధార : విశాఖ జిల్లా కళింగ కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక, వనభోజన కార్యక్రమం ఆదివారం మాధవధార తోటలో పేడాడ రమణికుమారి ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్పీకర్ తమ్మినేని సీతారాం హాజరై మాట్లాడారు. కళింగ కులస్తులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాల్లో సమస్యల పరిష్కారానికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. కళింగ కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయికను ఏర్పాటుచేసిన పేడాడ రమణకుమారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేడాడ తిలక్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు, మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఒబిసి చైర్మన్ మూల వెంకటరావు, మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్, శ్రీకాకుళం జడ్‌పి చైర్మన్ పిరియా విజయ, చౌదరి బాబ్జి, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, 50వ వార్డు తెలుగుదేశం అధ్యక్షులు సనపల వరప్రసాద్, మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నంబాల ఈశ్వరరావు, సనపల శ్రీకాంత్, పేడాడ నరసింగరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్లు పైడి శ్రీనివాసరావు, సనపల రవీంద్ర భరత్, కళ హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ పైడి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవ యువజన సమాజం మాజీ అధ్యక్షులందరినీ రమణికుమారి సత్కరించారు.

అలంకారప్రాయంగా సోలార్ నీటి పథకాలు

తాగునీటి కోసం ఇక్కట్లు పడుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: లక్షలాది రూపాయల కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన సోలార్ నీటి పథకాలు అలంకారప్రాయంగా మారాయి. విద్యుత్ లేని ప్రాంతాల్లో తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో గతంలో వీటిని ఏర్పాటు చేశారు. ఇవి ప్రజల దాహార్తిని తీర్చ లేకపోతున్నాయి. ఈ పథకాలు పని చేయక పోయినా అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. అరకువేలి మండలంలోని మారుమూల లోతేరు పంచాయతీ తోటవలస గ్రామంలో మంచి నీరు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.సోలార్‌తో కుళాయి ఉన్నప్పటికీ నాలుగు నెలల క్రితం మరమ్మతుకు గురైంది. కుళాయి పని చేయక పోవడంతో సోలార్ ట్యాంక్ అలంకప్రాయంగా ఉన్నాయి.దీంతో గ్రామంలో తీవ్రంగా మంచినీటి కొరత ఏర్పడింది. సుమారు 35 కుటుంబాలు నివస్తున్నారు. గ్రామానికి దూరంగా పాఠశాల ఎదురుగా ఉన్న మంచినీటి బోరు వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవలసి వస్తోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క బోరు పంపు పై ఆధార పడవలసిన పరిస్థితి ఎదుకొంటున్నామని, అది కూడా ఒక్కో సారి పనిచేయలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న తాగునీటి బోరు ఎండ తీవ్రతకు ఇంకిపోతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు.తక్షణమే అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సోలార్ గ్రావిటీ పథకాన్ని మరమ్మత్తు చేపట్టి వేసవిలో తాగునీటి సమస్య తీవ్రం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

అలంకార ప్రాయంగా ఉన్న సోలార్ నీటి పథకం ట్యాంక్

సమస్యలపై చేతి వృత్తిదారుల ధర్నా

ధర్నా చేస్తున్న చేతి వృత్తిదారులు

ప్రజాశక్తి -కంచరపాలెం : సమస్యల పరిష్కారాన్ని కోరుతూ కంచరపాలెం పరిధి బాపూజీనగర్ వద్ద ఏపీ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యాన కమిటీ అధ్యక్షులు గొలుసు నూకరాజు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎం.ఈశ్వరరావు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతివృత్తుల నుంచి వృత్తిదారులను దూరం చేస్తూ కార్పొరేట్ శక్తులను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచీకరణ, సరళీకరణ విధానాల వల్ల చేతివృత్తులన్నీ ధ్వంసం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంలో 1.70 కోట్ల మంది వివిధ చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 56 రకాల కార్పొరేషన్లు పెట్టినప్పటికీ నిధులు లేవన్నారు. రజక, చేనేత, వడ్రంగి, దర్జీ, కంచర, కమ్మర, కుమ్మరి, మేదర, సౌర, వడ్డెర, కల్లుగీత, గొర్రెలు మేకల పెంపకం, వాల్మీకి, బోయి, తదితరులు నేడు వృత్తులను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం చేతివృత్తిదారులను ఆదుకోవాలని కోరారు. వృత్తిదారుల కుటుంబాలకు రూ.25 వేల ఆర్థిక సహాయం అందించాలని, రజక వృత్తికి దోబీఘాట్లు, వృత్తి స్థలాలు కేటాయించాలని, చేనేత కార్మికులకు మగ్గం చెడ్డతో కూడిన ఇల్లు ఉచితంగా నిర్మించి ఇవ్వాలని, కమ్మరి, వడ్రంగి, సెలూన్ వృత్తిదారులకు పనిముట్లు ఇవ్వాలని, అన్నారు. జగనన్న చేదోడు పథకం ద్వారా చేత్తివృత్తిదారులందరికీ రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించాలని, కళ్ళు గీత వృత్తి అభివృద్ధికి, ఆధునికీకరణకు నిపుణులతో కమిటీ వేయాలని, రాష్ట్ర బడ్జెట్‌లో చేతివృత్తులకు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.ఈశ్వరరావు, కె.నూకరాజు, కమ్మరి వడ్రంగుల సంఘం అధ్యక్షులు కె.అప్పారావు, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు దమ్ము అప్పారావు, టిటి.రాము, ఎ.అప్పారావు, వి.శ్రీనివాసరావు, బి.నాగరాజు, బి.సురేష్, వృత్తిదారులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

ప్రజాశక్తి-మాధవధార : స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఆదివారం మాధవధార ప్రాంతంలో సిఐటియు నాయకులు కూన వెంకట్రావు ఆధ్వర్యాన సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లాభాల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్ ప్లాంట్ వల్ల ఎంతోమంది కార్మికులు ఉపాధి పొందుతున్నారని, ప్రయివేటుపరం అయితే వారంతా రోడ్డున పడతారని తెలిపారు. సంతకాల సేకరణ కార్యక్రమంలో మాధవధారలో ఉంటున్న స్టీల్‌ప్లాంట్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సంతకాలు సేకరిస్తున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

నేరాలు ఘోరాలు

చెట్టును ఢీకొన్న వ్యాన్ : డ్రైవర్ దుర్మరణం

ప్రజాశక్తి-చోడవరం : మండలంలో అడ్డూరు గ్రామం వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. ఎలమంచిలి మండలం గొల్లల పాలెం గ్రామానికి చెందిన వ్యాన్‌డ్రైవర్ కోన ప్రేమ్‌కుమార్ (26). కోళ్లలోడుతో వడ్డాది వైపు నుంచి సబ్బవరం వెళుతుండగా, అడ్డూరు గ్రామం వద్ద ప్రమాదవశాత్తు మర్రిచెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్‌డ్రైవర్ ప్రేమ్‌కుమార్ కేబిన్‌లో ఇరుక్కుపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించారు.

మానసిక ఆసుపత్రి నుంచి ఇద్దరు మహిళలు అదృశ్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధి చిన్న వాల్తేరులో ఉన్న ప్రభుత్వ మానసిక ఆసుపత్రి నుంచి ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు. దీనికి సంబంధించి మూడో పట్టణ పోలీసులు లుకౌట్ నోటీసు జారీ చేశారు. కోనసీమ అంబేద్కర్ జిల్లాకు చెందిన మూల ధనలక్ష్మి, ఆమె తల్లి మణికుమారి వైద్యం నిమిత్తం విశాఖపట్నం మానసిక ఆసుపత్రికి కొంతకాలం క్రితం వచ్చారు. వీరి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో గత ఏడాది నవంబర్ 3న ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసినట్టు అధికారులు చెబుతున్నారు. అయితే వారు ఇంటికి చేరలేదని వారి బంధువైన పల్లి రాంబాబు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసులు విచారణ ప్రారంభించారు. ఆచూకీ తెలిసినవారు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లోని 9440796011, 9989411511, 0891-275517 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అప్పన్న సన్నిధిలో పలువురు ప్రముఖులు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను ఆదివారం టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఆరిమండ వరప్రసాద్‌రెడ్డి, డాక్టర్ విజయసారధిరెడ్డి దంపతులు వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు.

ఘనంగా అనాథ చిన్నారుల జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరానగర్‌లోని ఆనందమార్గ్ ఆశ్రమంలో ఉన్న ఐదుగురు అనాథ చిన్నారుల జన్మదిన వేడుకలను మార్వారి యూత్ సభ్యులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలో గల 40 మంది పిల్లలకు దుస్తులు, మిఠాయిలు పంచి పెట్టారు. జన్మదిన వేడుకలను పురస్కరించుకొని చిన్నారులతో నృత్యాలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య సౌమ్యానంద అవధూత, ఆచార్య ఇష్ట ప్రేమానంద అవధూత, వసుంధరానంద అవధూత, మార్వారీ యూత్ సభ్యులు ఖందవాల్, సంజయ్ అగర్వాల్, అనూజ, భూపన్ ఖమ్కా, అతుల్, గంభీర్ అగర్వాల్ పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనం అందజేత

ప్రజాశక్తి-సింహాచలం: రథసప్తమిని పురస్కరించుకొని సింహాచలం దేవస్థానానికి సూర్యప్రభ వాహనాన్ని కృష్ణా జిల్లాకు చెందిన పాలడుగు కామయ్య చౌదరి అందజేశారు. ఈ వాహనాన్ని దేవస్థానం అలంకారి కర్రి సీతారామాచార్యులు పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ నరసింహారాజు, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ట్రస్ట్ బోర్డు సభ్యులు దినేష్ రాజు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్న అనుబంధ దేవాలయాల్లో భీష్మ ఏకాదశి కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి-సింహాచలం : సింహాచల దేవస్థానం అనుబంధ దేవాలయాలైన కొండపైన త్రిపురాంతర స్వామి ఆలయంలో, కొండ దిగువ వెంకటేశ్వర స్వామి ఆలయంలో, మాధవస్వామి ఆలయంలో, వేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఇఒ ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి ఒకటో తేదీన ఆయా ఆలయాల్లో నిర్వహించే కల్యాణోత్సవాలను వీక్షించాలని కోరారు.

ఘనంగా ఆంజనేయస్వామి వార్షికోత్సవం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని లోడగలవానిపాలెం పరిధిలో బుధవారం అభయాంజనేయ స్వామి 16వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు బమ్మిడి సూర్యనారాయణ ఉమాదేవి దంపతులు, సుమారు 6000 మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ, అన్నప్రసాదాలు స్వీకరించారు.

యూనివర్సిటీల్లో ఎయు టాప్

- ఇక్కడ చేరితే ఉద్యోగం గ్యారెంటీ అన్న భావన విద్యార్థుల్లో బలపడింది
- ఈ విద్యా సంవత్సరంలో పీజీలో వంద శాతం ప్రవేశాలు
- 'ప్రజాశక్తి'తో ఎయు విసి ప్రొఫెసర్ పివిజిడి.ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'దేశంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన విశ్వవిద్యాలయాల్లో ఆంధ్రా యూనివర్సిటీ ఒకటి. 1926లో విశాఖ సాగర తీరానికి సమీపంలో ఏర్పాటై ఎంతో మందికి ఉన్నత విద్యనందించడమే కాకుండా దేశంలోనే అనేక రంగాల్లో ప్రాచుర్యం పొందిన వారికి ఇదో సార్వత్రిక విద్యా కేంద్రంగా పేరుగాంచింది. తాజా విద్యా సంవత్సరంలో 21 స్టేట్ యూనివర్సిటీల్లో పీజీ అడ్మిషన్లలో టాప్ -1 స్థానం దక్కించుకుంది' అని ఆంధ్రా యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య పివిజిడి.ప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. యూనివర్సిటీ ప్రాంగణ సముదాయాలకు క్రొంగొత్త సొబగులు అద్దుతూ అభివృద్ధి పరిచే కృషిలో ఆయా విభాగాలను ఆధునికీకరించడం, ఖాళీ ప్రదేశాలను సైతం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంలో ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నట్టు ఆయన తెలిపారు. ఎయులో చేపడుతున్న పనులు, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను 'ప్రజాశక్తి'కి ఆయన తెలియజేశారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

ఎయు విద్యా వాతావరణంలో చాలా మార్పులు కనిపిస్తున్నాయి.. వాటి గురించి వివరించండి ?

రాష్ట్రంలో 21 స్టేట్ యూనివర్సిటీల్లో ఎయు ఈ ఏడాది పీజీ అడ్మిషన్లలో వంద శాతం ప్రవేశాలతో టాప్ 1లో నిలిచింది. వెబ్ ఆప్షన్లలో ఎయునే పలువురు విద్యార్థులు ఎంపిక చేసుకోవడం యూనివర్సిటీలో విద్యా వాతావరణం ఎలా ఉందో తెలియజేస్తుంది. ఇక్కడ చేరితే ఉద్యోగం గ్యారెంటీ అన్న భావన విద్యార్థి నుంచి మరో విద్యార్థికి నోటి మాట ద్వారా పాకింది. వెబ్ ఆప్షన్లను ఎంపిక చేసుకుని జాయిన్ అవుతున్నారు. సైన్స్ పీజీ విభాగంలో 1249 ఖాళీలుంటే అన్నీ నిండిపోయాయి. పోస్టు గ్రాడ్యుయేషన్ ఆర్ట్స్ విభాగంలో 980 సీట్లకు 940 అంటే 99శాతం పూర్తయ్యాయి. ఒకప్పుడు విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాలకే పరిమితమైన ఎయులో రాయలసీమ ప్రాంతంలోని కడప, చిత్తూరు, కర్నూలు, అలాగే ప్రకాశం, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి పీజీ అడ్మిషన్లలో చేరారు. రాష్ట్రంలో ఎస్‌వి లాంటి యూనివర్సిటీలున్నా సరే ఎయు ఒక్కటే వంద శాతం ప్రవేశాల మైలురాయిని దాటింది.

యూనివర్సిటీలో రెండు, మూడు విభాగాలను తరలించారన్న ప్రచారంలో వాస్తవమెంత ?

యూనివర్సిటీ ప్రాంగణాన్ని దాతల సాయంతో అభివృద్ధి చేస్తున్నాం. ప్రభుత్వం, యూనివర్సిటీ నిధుల నుంచి ఒక్కపైసా వినియోగించడం లేదు. భావితరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఒక విజన్‌తో ముందుకు సాగుతున్నాం. రాజధాని గురించి ఏం చర్చ జరుగుతుందో నా దృష్టిలో లేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనా సరళిని బట్టి విద్యా సంస్థలు, యూనివర్సిటీల్లో ఒక్క అంగుళం కూడా రాజధాని కోసం తీసుకోరన్నది కఠోర సత్యం. యూనివర్సిటీలోగల విద్యాభవన్‌లోని సంస్కృతి, ఎడ్యుకేషన్ విభాగాలను మూడు నెలల క్రితం ఎదురుగా ఉండే ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలోకి తరలించాం. ఆ భవనం నిర్మాణం జరిగి 40 ఏళ్లవుతోంది. ఆధునికీకరణ కోసం ముందు చెప్పినట్లు రూ.40 లక్షల దాతల నిధులతో భవన సముదాయాన్నంతటినీ కొత్త హంగులతో తీర్చిదిద్ది 'విద్యాతరంగిణి' అని పేరు పెట్టి 300 మంది ఎయు ఉమెన్స్‌కు వసతిగృహంలా మార్చాం. తరలింపు రాజధాని కోసం కాదు.. ఆధునికీకరణ కోసం చేశాం. ఆ రెండు విభాగాల్లో గడచిన పదేళ్లలో విద్యార్థుల సంఖ్య సంస్కృతంలో 50 మంది ఒక ఫాకల్టీతోనూ, ఎడ్యుకేషన్‌లో 200 మంది ముగ్గురు ఫ్యాకల్టీలతో నడిచింది. ఈ రెండు విభాగాలను ఖాళీ చేయించి వేరొక చోటకు మార్చాం.

ఎయు ఛాన్సలర్‌గా మీరెలా పీలవుతున్నారు ?

ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ విద్యార్థిగా భవిష్యత్తు తరం గుర్తుంచుకునే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలనుకున్నాను. ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నాను. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో విద్యా వాతావరణం కాపాడడం, అత్యధిక మంది ప్లేస్‌మెంట్‌లు సాధించడంలో సఫలీకృతం అయ్యాను. కావాలనుకుంటే రాష్ట్ర స్థాయిలో చాలా ఉన్నత స్థానాలకు వెళ్లేవాడిని. కానీ నా లక్ష్యం అది కాదు. ఇక్కడే చదువుకుని ఈ ప్రాంగణాన్ని తీర్చిదిద్దే అవకాశం లభించడం నిజంగా అదృష్టం. యూనివర్సిటీ అభివృద్ధి, ప్రాంగణాల ఆధునికీకరణ, విద్యార్థుల సంక్షేమం కోసం కృషిని కొనసాగిస్తాను. నా టర్మ్ అయిపోయాక నేను విశాఖలో తిరిగే క్రమంలో ఏ ఒక్కరూ వేలెత్తి నా వైపు చూపించేలాగ ఏ పనీ చేయలేదు. నా భవిష్యత్తు కార్యాచరణ కూడా అలా ఉండదు.

నేడే ఉక్కు ప్రజా గర్జన

భారీగా తరలిరానున్న ప్రజానీకం - హాజరుకానున్న రాజకీయ పార్టీల రాష్ట్ర నేతలు
త్రిష్ణా మైదానంలో ఏర్పాట్లు పూర్తి
వాహనాల పార్కింగ్‌కు పలు ప్రాంతాలు కేటాయింపు

ప్రజాశక్తి - ఉక్కునగరం

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కేంద్రంలోని మోడీ సర్కారుతో అమీతుమీ తేల్చుకోవడానికి స్టీల్‌ప్లాంట్ కార్మికవర్గం సిద్ధమైంది. ఈ క్రమంలోనే పోరాట పంథాను, స్వరూపాన్ని మార్చింది. సోమవారం ఉక్కు నగరంలోని త్రిష్ణా మైదానంలో సాయంత్రం 3 గంటలకు 'ఉక్కు ప్రజా గర్జన' పేరుతో భారీ సభను నిర్వహించేందుకు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సిద్ధమైంది. మరోపక్క విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల జెఎసి కూడా ఈ గర్జన సభను విజయవంతం చేయడానికి తీవ్రంగా కృషి చేస్తోంది. ఈ మేరకు రాజకీయ పార్టీల నాయకులందరికీ ఆహ్వానాలు వెళ్లాయి. ఉక్కు ప్రజా గర్జన బహిరంగ సభలో రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల (బిజెపి మినహా)కు చెందిన రాష్ట్ర నాయకులు పాల్గొననున్నారు.

త్రిష్ణా మైదానంలో ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

భారీ ఎత్తున ఏర్పాట్లు

ఉక్కు ప్రజా గర్జన సభకు భారీ ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. పోరాట కమిటీ నాయకులు ఆదివారం దగ్గరుండి ఏర్పాట్లును పర్యవేక్షించారు. త్రిష్ణా గ్రౌండ్‌కు వేలాదిగా ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా పలు సూచనలు చేశారు. కుర్చీలు, మంచినీరు, వాహనాల పార్కింగ్ పక్కగా ఉండాలని సూచించారు. బహిరంగ సభకు వచ్చే వాహనాల పార్కింగ్‌కు స్థలాలను కేటాయించారు. తెలుగు తల్లి విగ్రహం నుంచి వచ్చే వాహనాలను డిఎవి స్కూల్ నుంచి టౌన్ అడ్మిన్ బిల్డింగ్ వైపునకు మళ్లిస్తామని అన్నారు. అగనంపూడి నుంచి స్టీల్‌ప్లాంట్ జనరల్ హాస్పిటల్ మీదుగా వచ్చే వాహనాలను సెక్టార్ 6 కాంప్లెక్స్ నుంచి విశాఖ విమల విద్యాలయం వరకూ, ఉక్కునగరం జంక్షన్ నుంచి వచ్చే వాహనాలను హాస్టల్ బస్‌స్టాప్ నుంచి సత్య సాయిబాబా ఆలయం వరకు అనుమతించనున్నట్లు వెల్లడించారు. వెంకటేశ్వర స్వామి ఆలయం, కేంద్రీయ విద్యాలయం నుంచి వాహనాలకు, సెక్టార్ ఫైవ్ షాపింగ్ కాంప్లెక్స్ నుంచి జ్యోతి బాలవిహార్ రోడ్డు మార్గంలో వచ్చే వాహనాలకు, ఆగ్రో ఫారెస్ట్ రోడ్డు సెక్టార్ 1 మీదుగా వచ్చే వాహనాలకు హాస్టల్ బస్ స్టాప్ - సెక్టార్ 4 రోడ్డులో నిలపడానికి పార్కింగ్ స్థలాలు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

తరలిరానున్న రాజకీయ నేతలు

గర్జన సభకు వైసిపి నుంచి టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి రానున్నారు. టిడిపి నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెంనాయుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొంటారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జనసేన రాష్ట్ర నాయకులు నాదెండ్ల మనోహర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాకేష్ రెడ్డి, తదితరులు హాజరుకానున్నట్టు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ తెలిపింది.

వాడవాడలా ప్రచారం

సోమవారం జరిగే ఉక్కు ప్రజా గర్జన సభను విజయవంతం చేయాలని నిర్వాసిత ప్రాంతాల్లో ఆదివారం ప్రచారం హోరెత్తింది. కార్మిక నేతలు పాదయాత్ర చేపట్టారు. వారు ఇప్పటికే పెదగంట్యాడ, గంగవరం, వడ్లపూడి తదితర ప్రాంతాల్లో 15 రోజులుగా నిర్విరామంగా ప్రచారం చేస్తూ వచ్చారు. ఆదివారం కూడా అగనంపూడి నిర్వాసిత ప్రాంతంలో పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరాం ఆధ్వర్యంలో పాదయాత్ర చేశారు. స్థానిక జనసేన నేతలు మద్దతుగా నిలిచి పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ ప్రజా సంపదను కాపాడుకోవడానికి చేస్తున్న ఈ పోరాటం చారిత్రాత్మకమైనదని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలను ఒకే తాటిపైకి తీసుకువచ్చేందుకు చేస్తున్న ఈ ప్రయత్నాన్ని ప్రజలు జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఇల్లపు ప్రసాద్, గవర సోమ శేఖర్, నీలకంఠం, గోవింవ, పైడిరాజు, ఎం.వెంకటరమణ, అట్టా అప్పారావు పాల్గొన్నారు. అలాగే ఉక్కునగరంలోనూ, పలు నిర్వాసిత కాలనీల్లోనూ పోరాట కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున బైక్ ర్యాలీ చేపట్టారు. ప్రజలు ఎక్కడికక్కడ మద్దతు తెలిపారు.

668వ రోజుకు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయరాదని గర్జిస్తూ సోమవారం స్టీల్‌ప్లాంట్‌లో లక్షలాది మందితో ప్రజా గర్జన జరగనుందని, దీనిని చూశాక స్టీల్‌ప్లాంట్‌ను కొనుగోలు చేయాలని ముందుకు వచ్చే పెట్టుబడిదారులు వెనక్కి వెళ్లక తప్పదని టిఎన్‌టియుసి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉప్పిలి రామకృష్ణ అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు ఆదివారానికి 668వ రోజుకు చేరాయి. దీక్షల్లో టిఎన్‌టియుసి కార్యకర్తలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రగతికి, విశాఖ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్న ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందామన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. విశాఖ అభివృద్ధిని కుంటిపడేలా చేయాలని, రిజర్వేషన్లు తుంగలోకి తొక్కాలని ప్రభుత్వాలు చూస్తున్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు కొనసాగితేనే శాశ్వత ఉద్యోగాలు వస్తాయన్నారు. దీక్షల్లో ఎంఎస్.కృష్ణ, సత్రబాయిన చినఅప్పారావు, పీలా సుబ్బారావు, నంబాల సత్యనారాయణ, ఇలిపిల్లి అప్పారావు, పి.గణపతి, పెద్దాడ పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు

ఇష్టమైన నేత బివి.రాఘవులు

- ప్రజ్ఞ, ఎస్‌విఎస్ కళాశాలల ఫేర్‌వెల్ ఫంక్షన్‌లో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ప్రజాశక్తి - ఎస్.రాయవరం

తనకు రాజకీయాల్లో సిపిఎం నేత బివి.రాఘవులు అంటే ఎంతో ఇష్టమని, జాతీయ ప్రముఖుల్లో స్వామి వివేకానంద అంటే అభిమానమని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలని తెలిపారు. ఆదివారం అడ్డురోడ్డులోని శ్రీ ప్రజ్ఞ జూనియర్ కాలేజీ, ఎస్‌విఎస్ డిగ్రీ కాలేజీ ఫేర్‌వెల్ ఫంక్షన్ జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన్ని పలువురు విద్యార్థులు ప్రశ్నలు అడిగారు. వాటికి తనదైన శైలిలో ఆయన సమాధానమిచ్చారు. ఉద్యోగంలో కంటే రాజకీయ జీవితంలోనే ప్రజా సేవచేసే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. తాను రాజకీయాల్లోకి రావడానికి కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్ రెడ్డి ఆశయాలే కారణమన్నారు. ఆయన ప్రోద్బలంతోనే రాజకీయ ప్రవేశం చేశానన్నారు. రాజకీయంలోకి వచ్చాక తన కుటుంబం కంటే ప్రజలే కుటుంబమని భావించానన్నారు. మూడుసార్లు గెలిచినా మంత్రి పదవి రాలేదని, అయినా ఎక్కడా నిరాశ పడలేదని, అవకాశాలు అందరికీ అంత తొందరగా రావని అన్నారు. ఉన్న అవకాశాలను సద్వినియోగపరుచుకోవాలని విద్యార్థులకు సూచించారు. నాయకులుగా ఎదగాలంటే ధనం ముఖ్యం కాదన్నారు. పేదలకు మంచి చేసే లక్షణాలుండాలన్నారు. రాజకీయం మంచిదేగానీ నాయకులు మంచివారుగా ఉండడం లేదన్నారు. మానవ సేవయే మాధవ సేవ అని నమ్మి రాజకీయాల్లోకి తాను వచ్చానన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకులు శీలామంతుల వీరభద్రరావు, చైర్మన్ ఆదిత్య, ప్రిన్సిపాల్ రాపర్తి రాము, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వాసుపల్లి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గం 27వ వార్డు పరిధిలోని అశోక్ నగర్‌కు చెందిన పెద్దాడ ముఖేష్ (ఆదినారాయణ) కుటుంబానికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆర్థిక సాయం అందించారు. వైసిపి కార్యకర్తగా ఉన్న ముఖేష్ బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆదివారం మరణించారు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే గణేష్ కుమార్ అశోక్‌నగర్ వెళ్లి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళ్లర్పించారు. దహన ఖర్చుల నిమిత్తం అతని కుటుంబ సభ్యులకు తన సొంత నిధుల నుంచి రూ.10 వేలును ఆర్థిక సాయంగా అందజేశారు. ముఖేష్ ఈ ప్రాంతంలోని ఎస్‌సి కుల పెద్ద పెద్దాడ అప్పారావు కుమారుడు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట వైసిపి 27వ వార్డు అధ్యక్షులు నీలాపు సర్వేశ్వరరెడ్డి, ఈతలపాక విజయ్, మధు ఉన్నారు.

అన్నవరంలో ఒబెరాయ్ సంస్థకు.. 40 ఎకరాలు కేటాయింపు

ప్రజాశక్తి - భీమునిపట్నం : మండలంలోని అన్నవరం గ్రామ పంచాయతీ వద్ద ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖకుగల 40 ఎకరాల స్థలాన్ని ఒబెరాయ్ గ్రూప్ కంపెనీకి లీజ్ కమ్ రెంట్ ప్రాతిపదికన కేటాయించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా ఆదివారం సదరు స్థలాన్ని ఒబెరాయ్ గ్రూప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి విక్రమ్ ఒబెరాయ్, సంస్థ కార్పొరేట్ వ్యవహారాల అధ్యక్షులు రాజారామన్ శంకర్, ముఖ్య ఆర్థిక నిర్వహణాధికారి శ్రీ కల్లోల్ కుందులతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక రంగ పరంగా విశాఖపట్నం ప్రాధాన్యతను, రాబోయే కాలంలో విశాఖలో చేపట్టనున్న పలు ప్రభుత్వ ప్రాజెక్టులను గురించి ఒబెరాయ్ సంస్థ నిర్వాహకులకు వివరించారు. కార్యక్రమంలో ఎపి పర్యాటక శాఖ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ మల్ రెడ్డి, పర్యాటక శాఖ రీజనల్ డైరక్టర్ శ్రీనివాస్ పాణి, భీమిలి ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డి, మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.